క్లుప్తంగా

ప్రజలు సంతోషంగా ఉండాలి

పిచ్చాటూరు: నియోజకవర్గ ప్రజలకు శోభకృత్ నామ సంవత్సరంలో అన్ని శుభాలే కలగాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం సాయంత్రం పిచ్చాటూరు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమ పాలనలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మేలు జరగాలన్నారు. ప్రతి ఇల్లు కళకళలాడాలని, తెలుగు సంస్కృతి వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

మునిరామయ్య యాదవ్ మృతి పార్టీకి తీరనిలోటు


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి రూరల్: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పూడి మునిరామయ్య యాదవ్ మృతి పార్టీకి తీరని లోటు అని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి గ్రామానికి చెందిన మునిరామయ్య యాదవ్ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం కాపుగున్నేరికి చేరుకుని దహనక్రియలు అయ్యే వరకు ఉన్నారు. తర్వాత మునిరామయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పరామర్శించిన వారిలో రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వయ్యాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ అక్కుపల్లి భానుయాదవ్, మండల యూత్ కన్వీనర్ వెంపల్ల సురేంద్రయాదవ్ ఉన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఏర్పేడు: మండలంలోని పెన్నగడం పంచాయతీ కొత్తకాల్వ గ్రామంలో నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎంపీపీ గీత, మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు ఎంపీ గ్రాంట్ కింద రూ.20 లక్షల నిధులను మంజూరు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధాకృష్ణ, మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి రిమాండ్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో ఓ చోరీ కేసులో యశ్వంత్ అనే యువకున్ని రిమాండ్‌కు తరలించినట్లు 1వ పట్టణ సీఐ అంజుయాదవ్ తెలిపారు. వివరాలు.. ఈ నెల 17వ తేదీ పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మంపడంలో భారీ చోరీ జరిగింది. బాధితులు 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే సీఐ అంజుయాదవ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడి సీసీ కెమెరా పుటేజీల ద్వారా కేసును ఓ కొలిక్కి తెచ్చారు. చోరీకి పాల్పడింది వీఎంసీ కూడలి సమీపంలోని యశ్వంత్‌గా గుర్తించారు. అతని కోసం గాలించి సోమవారం రాత్రి అరెస్టు చేశారు. మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రజారోగ్యమే లక్ష్యం

శ్రీకాళహస్తి: ప్రజా ఆరోగ్యమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కుమారస్వామి తిప్ప వద్ద ఉన్న పురపాలకసంఘ పాఠశాలలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులు, కళ్లద్దాలు కూడా ఉచితంగా అందజేస్తారన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా, గోరా, ఫజల్, షాకీర్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యభద్రతకు ప్రాధాన్యత

- పిల్లలకు ప్రభుత్వం మంచి పౌష్టికాహారం అందిస్తోంది
- జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగిజావ పంపిణీ
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


విద్యార్థినుల నృత్యప్రదర్శన, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలతో విద్యార్థులు

శ్రీకాళహస్తి: విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు వారంలో మూడు రోజులపాటు రాగిజావ అందజేస్తారన్నారు. పిల్లల్లో ఐరన్, క్యాల్షియం లోపాలు తలెత్తకుండా నివారించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందుకు పుట్టపర్తి సత్యసాయి చారిటబుల్ ట్రస్టు సహకారం అందిస్తోందన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు గుమ్మడి బాలకృష్ణయ్య, పగడాల రాజు, షేక్ సిరాజ్ బాషా, వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, నాని, చింతామణి పాండు, ఆర్కాడు శంకర్, రవి, స్వామిరెడ్డి భరత్‌రెడ్డి, చిట్టివేలు జయగోపాల్, నంద, మధురెడ్డి, మునిరెడ్డి, పులి రామచంద్ర, సురేష్, లీలా ధనలక్ష్మి, సుధ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: విద్యార్థులు చదువుతో పాటు శారీరకంగా, మానసికంగా ఎదుగుదలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పాపానాయుడుపేట ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్దలో భాగంగా ఆయన విద్యార్థులకు రాగిజావను అందించారు. అనంతరం ఎంపీపీ గీత మాట్లాడుతూ జగనన్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతున్నట్లు వివరించారు. అలాగే మండలవ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విద్యార్థులకు రాగిజావ అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంఈఓ ప్రేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రాగిజావ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడులో..

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తొట్టంబేడు మండల ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, ఎంఈఓ భారతి అన్నారు. మంగళవారం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మండలంలోని పెద్ద కన్నలి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం ఎంఈఓ భారతి మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలో రాగిజావ పంపిణీని ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీలు కన్నలి మల్లికమ్మ, గెరటారెడ్డి, పెద్దకన్నలి హెచ్‌ఎం శ్రీనివాసులు, సాంబయ్యపాలెం మార్టిన్, హెచ్‌ఎంలు మంగీలాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట: రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో మంగళవారం పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌తో కలసి రేణిగుంట సర్పంచ్ నగేశం విద్యార్థినులకు రాగిజావను పంపిణీ చేశారు. అలాగే చెక్‌పోస్ట్ వద్ద ఉన్న ఇన్ఫాంట్ జీసెస్ స్కూల్‌లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రజుమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారమే లక్ష్యంగా రాగిజావ పంపిణీ

సత్యవేడు: రాగిజావలో 8 రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, రాగి జావ తీసుకోవడం ద్వారా విద్యార్థుల్లో రోగ నిరోధక శక్తిని పెరుగుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఉదయం పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్‌రెడ్డితో కలసి ఆమె విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఎంపీడీఓ బాలగణేష్, ఎంఈఓ కె.రవి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కె.శ్యాంప్రసాద్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు మస్తానీ, ఎంపీటీసీ సభ్యుడు పునీదకుమార్, స్కూల్‌కమిటీ చైర్మన్ కుమార్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి, ఉప సర్పంచ్ మునిరాజాతో కలసి ఎంఈఓ రవీంద్రనాథ్ రాగి జావను పంపిణీ చేశారు. హెచ్‌ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాయణవనం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావను ప్రజాప్రతినిధులు, పీఎంసీ సభ్యుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. భీమునిచెరువులో సర్పంచ్ మురుగేశంతో కలిసి ఎంఈవో భారతి పంపిణీని ప్రారంభించారు.

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడి ప్రాథమిక పాఠశాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు రాగి జావ పంపిణీని ప్రారంభించారు. ఎంఈఓ హేమమాలిని, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మధుసూదన్‌రావు, సింగిల్ విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రరెడ్డి, వైస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి పాల్గొన్నారు.


సత్యవేడులో రాగిజావ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి

నాగలాపురంలో..

నాగలాపురం ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ బాబయ్య, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, సచివాలయ మండల కన్వీనర్ మోహన్ మొదలి, పీఎంసీ చైర్మన్ దేశన్, నాయకులు శ్యామ్, టీచర్లు పాల్గొన్నారు.

కేవీబీపురం: మోడల్ స్కూల్‌లో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గవర్లకృష్ణయ్య జావ పంపిణీని ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, నాయకులు నందకుమార్, లాల్‌బాబుయాదవ్, హరిబాబు సుబ్బన్న, అయ్యప్ప పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: గోవర్ధనపురం హైస్కూల్‌లో రాగి జావ పంపిణీని వైస్ ఎంపీపీ బొప్పన పద్మావతి ప్రారంభించి విద్యార్థులకు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

వరదయ్యపాళెం: కురింజల్లం వద్ద పేకాట ఆడుతున్న చెంగయ్య, గోవర్ధన్, మహేష్, వెంకటేష్, వెంకటయ్యను అదుపులోకి తీసుకున్నారు. రూ. 2100 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టండి

రేణిగుంట: రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో విమానాశ్రయం, రైల్వేస్టేషన్, పారిశ్రామికవాడలు, జాతీయస్థాయి విద్యాసంస్థలు, గుడిమల్లం వంటి పురాతన ఆలయాలు, జాతీయ రహదారి ఉన్న నేపథ్యంలో నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టాలని తిరుపతి ఎస్పీ పరమేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సబ్ డివిజన్ పరిధిలో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసులను ఆరాతీశారు. అనంతరం ఆయన రేణిగుంట డీఎస్పీ రామచంద్రకు పలు సూచనలు చేశారు. డీసీఆర్‌బీ సీఐ చంద్రశేఖర్ పిళ్లై పాల్గొన్నారు.


రేణిగుంట డీఎస్పీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ముందస్తు ఉగాది వేడుకలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో శోభకృత్ నామ ఉగాది ముందస్తు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు కృష్ణకిషోర్, వాసంతి కిషోర్ విద్యార్థులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.


సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు

ప్రజలకు శుభాలు కలగాలి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు నిత్యం సుఖసంతోషాలతో వర్ధిల్లాల్లని, వారికి ఉగాది సందర్భంగా శుభాలు కలగాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటనలో ప్రజలకు తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శోభకృత నామ సంవత్సరంలో పంటలు బాగా పండాలని, రైతన్నలు ఆనందంగా ఉండేలా శ్రీకాళహస్తీశ్వరుని ఆశీస్సులు అందాలని కోరుకున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నష్టం

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం దళితవాడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టం సంభవించింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సీహెచ్ శేఖర్, మంజులకు చెందిన ఇంట్లో ఉండగా మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. నష్టాన్ని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. తమకు ప్రభుత్వం అండగా నిలవాలని బాధిత కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

కాంబాకం గిరిజనకాలనీలో కార్డన్ సెర్చ్

వరదయ్యపాళెం: మండలంలోని కాంబాకం గిరిజన కాలనీలో ఎస్‌ఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇల్లు తనిఖీ చేశారు. 15 వాహనాలను రికార్డులు లేనివిగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్‌ఐలు పొన్నుస్వామి, షణ్ముగం, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య పూజలు

నారాయణవనం: మండలంలోని పలు ఆలయాలలో అమావాస్య పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రముఖ అవధూత శ్రీసొరకాయల స్వామి ఆలయంలో, కైలాస నాథకోనలోని శివశక్తి, శాంతి ఆశ్రమాల్లో, కీళగరం శ్రీఅవనాక్షమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు.

నేడు ఉగాది ఆస్థానం

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీశోభకృత్ నామ సంవత్సరాదిని పురస్కరించుకుని బుధవారం ఉగాది ఆస్థానాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. సాయంత్రం 5 గంటలకు శేష వాహనంపై కొలువుదీర్చిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఉత్సవర్లకు పట్టు వస్త్రాలను సమర్పించి, ఉగాది ఆస్థానం, పంచాగ శ్రవణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పళ్లికొండేశ్వరాలయ ఆదాయం రూ.11.68 లక్షలు



పిచ్చాటూరు: సురుటపల్లి శ్రీపళ్లికొండేశ్వరాలయ భూముల వేలం, హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.11.68 లక్షల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం దేవదాయశాఖ తిరుపతి గ్రూప్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ ఫణిరాజశయన ఆధ్వర్యంలో 24 రోజుల హుండీ కానుకల లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపు ద్వారా రూ.2,31,555 ఆదాయం వచ్చినట్లు చైర్మన్ వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆలయానికి చెందిన ఊత్తుకోటలోని 0.92 సెంట్ల భూమికి నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా రూ.9.36 లక్షలు సమకూరిందన్నారు. ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు ఆనంద్, మునివేలు, సురేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు భక్తకన్నప్పకు ముక్కంటి సారె

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం భిక్షాల గాలిగోపురం సమీపంలోని స్వామివారి తేరు పక్కనే ఉన్న భక్తకన్నప్పకు ముక్కంటి ఆలయం తరఫున బుధవారం సారె సమర్పించనున్నారు. ఏటా ఉగాది సందర్భంగా భక్తకన్నప్పకు సారె సమర్పించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో భక్తకన్నప్పకు అలంకరణలు చేపట్టారు.


ముస్తాబవుతున్న భక్తకన్నప్ప

దెబ్బతిన్న పంటల పరిశీలన

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'అకాల వర్షం–వేరుశనగ పంటనష్టం' కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. మండలంలోని చియ్యవరం, బసవయ్యపాళెం గ్రామాల్లో ఇటీవల వర్షాలకు వేరుశనగ సాగు చేసిన రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. పంట వేసిన వారంలోపే వర్షాలు కురవడంతో చియ్యవరంలో 150 ఎకరాలు, బసవయ్యపాళెంలో 20 ఎకరాల్లో వేసిన వేరుశనగ మొలకెత్తలేదు. సుమారు రూ.50 లక్షల వరకు నష్టం వచ్చిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఏఓ సురేంద్రరెడ్డి చియ్యవరం గ్రామంలో దెబ్బతిన్న పంట వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. పంటనష్టం అంచనా వేసి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


పంటనష్టంపై రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఏఓ సురేంద్రరెడ్డి

ఉగాది ఏర్పాట్లపై సమీక్ష

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉగాదిని పురస్కరించుకుని ఆలయ పరిపాలన భవనంలో మంగళవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాదిని పురస్కరించుకుని మొదటిసారి ఆలయంలో తయారు చేయబడిన పంచాంగం ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఉగాది రోజున ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు, ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన శ్రీఅంకాలమ్మ ఆలయంలో మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ భక్తులకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.